క్లుప్తంగా

తెలుగుభాషలో అపార జ్ఞాన సంపద



సమావేశంలో మాట్లాడుతున్న రామలింగేశ్వరరావు

సీటీఆర్ఐ: తెలుగు భాషలో అపార జ్ఞాన సంపద, భావ సంపద ఉన్నాయని సినీ గేయ రచయిత జొన్నవిత్తుల రామలింగేశ్వరరావు పిలుపునిచ్చారు. తెలుగు భాషా వారోత్సవాల సందర్భంగా స్థానిక ధర్మంచర కమ్యూనిటీ హాల్లో ఆదివారం ఏర్పాటు చేసిన కార్యక్రమంలో 'మన భాష కోసం మనం ఏం చెయ్యాలి' అనే అంశంపై జొన్న విత్తుల మాట్లాడారు. మన భాషను మనం పరిరక్షించుకుంటేనే, మన కుటుంబ వ్యవస్థ, బంధాలు, అనుబంధాలు, మమతానురాగాలు పది కాలాల పాటు నిలుస్తాయన్నారు. తెలుగు భాషను పరిరక్షించే వారికే మనం ఓటు వేద్దామన్నారు. సమావేశంలో ప్రాచార్య శలాక రఘునాథ శర్మ, ప్రవచన రాజహంస డాక్టర్ ధూళిపాళ మహాదేవ మణి, సాహితీవేత్త యర్రాప్రగడ రామకృష్ణ, శతవధాని బులుసు అపర్ణ, కొల్లూరు సతీష్ శర్మ, సీనియర్ పాత్రికేయుడు కృష్ణ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

రెల్లి కులాలకు 3 శాతం రిజర్వేషన్ కల్పించాలి




సమావేశంలో మాట్లాడుతున్న వెంకటేశ్వరరావు

సీటీఆర్ఐ: ఎస్సీ వర్గీకరణలో రెల్లి కులాలకు మూడు శాతం రిజర్వేషన్ కల్పించాలని రెల్లి కులాల సంక్షేమ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు నీలాపు వెంకటేశ్వరరావు కోరారు. స్థానిక తాడితోట రెల్లి వీధిలోని సంఘ కార్యాలయంలో ఆదివారం జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడారు. 2004లో వర్గీకరణ చేసినప్పుడు రెల్లి కులాల వారికి ఏ కేటగిరిలో ఒక శాతం వల్ల నష్టం వాటిల్లిందన్నారు. అందుకే భవిష్యత్తులో జరిగే వర్గీకరణలో రెల్లి (ఎస్సీ), రెల్లి అనుబంధ కులాల వారికి 3 శాతం రిజర్వేషన్ కల్పించాలని కోరారు. వివిధ సంస్థల్లో పనిచేసున్న రెల్లి కుల ఉద్యోగస్తుల ఆత్మగౌరవం, ప్రభుత్వం భర్తీ చేస్తున్న ఉద్యోగాలు, ఉద్యోగ భద్రత, హక్కుల గురించి పోరాడేందుకు రెల్లి కుల సంక్షేమ సంఘానికి అనుబంధంగా ఏపీ రెల్లి కులాల ఉద్యోగుల ఐక్య కార్యాచరణ సమితిని ఏర్పాటు చేశామన్నారు. సమావేశంలో బంగారు తాతారావు, యర్రంశెట్టి రాజ్ కుమార్, వడ్డాది సింహాచలం పాల్గొన్నారు.

గుండె వ్యాధులపై అవగాహన

సీటీఆర్ఐ: గుండె వ్యాధులపై ప్రతి ఒక్కరికీ అవగాహన ఉండాలని జవహర్ వాకర్స్ క్లబ్ అధ్యక్షుడు వి.సత్యనారాయణ అన్నారు. స్థానిక వెంకటేశ్వర నగర్‌లోని ఇండియన్ మెడికల్ అసోసియేషన్ హాల్లో జవహర్ వాకర్స్ క్లబ్ ఆధ్వర్యంలో ఆదివారం సదస్సు నిర్వహించారు. గుండె వ్యాధులు రావడానికి కారణాలు, తీసుకోవాల్సిన జాగ్రత్తలను తెలిపారు. క్లబ్ సభ్యులకు ఉచితంగా ఆరోగ్య పరీక్షలు నిర్వహించారు. డాక్టర్లు కొల్లూరు లక్ష్మణ్, వంశీకృష్ణంరాజు మాట్లాడుతూ గుండె వ్యాధుల లక్షణాలను వివరించారు. అనంతరం క్లబ్ తరఫున డాక్టర్లను సత్కరించారు.

ఎన్డీఏ ప్రభుత్వం గద్దె దిగే వరకూ పోరాటం



సమావేశంలో మాట్లాడుతున్న అక్కినేని వనజ

ప్రకాశం నగర్: కేంద్రంలోని ఎన్డీఏ ప్రభుత్వం గద్దె దిగే వరకూ తమ పోరాటం ఆగదని సీపీఐ జాతీయ కార్యవర్గ సభ్యురాలు అక్కినేని వనజ అన్నారు. స్థానిక సీపీఐ కార్యాలయంలో ఆదివారం జరిగిన విలేకరుల సమావేశంలో ఆమె మాట్లాడారు. కేంద్రంలో బీజేపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన నాటి నుంచీ దేశంలో కుల, మత ఘర్షణలు పెరిగిపోయాయన్నారు. ప్రజాస్వామ్య మనుగడకు ముప్పు వాటిల్లుతోందని ఆవేదన వ్యక్తం చేశారు. 2019 ఎన్నికల్లో బీజేపీతో తెగతెంపులు చేసుకున్న చంద్రబాబు ఇప్పుడు ఎందుకు పొత్తు కోసం తహతహలాడుతున్నారో రాష్ట్ర ప్రజలకు వివరించాల్సిన బాధ్యత ఉందన్నారు. విభజన హామీలను అమలు చేయడంలో ప్రధాని మోదీ తీవ్రంగా విఫలమయ్యారన్నారు. రానున్న ఎన్నికలలో ఇండియా కూటమిని గెలిపించాలని పిలుపునిచ్చారు. సమావేశంలో జిల్లా కార్యదర్శి తాటిపాక మధు, నగర కార్యదర్శి వంగమూడి కొండల రావు, సహాయ కార్యదర్శి రమణ పాల్గొన్నారు.

ఘనంగా సత్తెమ్మ తల్లి జాతర

పెదపూడి: మండలంలోని వేంద్ర గ్రామంలో నర్ల వారి సత్తెమ్మ తల్లి జాతర ఆదివారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా అమ్మవారిని ప్రత్యేకంగా అలంకరించారు. కోరిన కోర్కెలు తీర్చే కల్పవల్లిగా అమ్మవారిని స్థానికులు కొలుస్తారు. ఆదివారం ఉదయం అధిక సంఖ్యలో భక్తులు తరలివచ్చి అమ్మవారిని దర్శించుకుని మొక్కుబడులు చెల్లించుకున్నారు. అనంతరం భక్తులకు తీర్థప్రసాదాలు అందజేశారు.

ప్రజారోగ్య పరిరక్షణ సమష్టి బాధ్యత



శాంతిపురంలో డ్రైనేజీ సమస్యలపై ఆరా తీస్తున్న మంత్రి వేణుగోపాలకృష్ణ

- జిల్లా ఇన్‌చార్జి మంత్రి వేణు
- 16వ డివిజన్‌లో 'స్వచ్ఛత మనందరి బాధ్యత'

ఆల్కాట్‌తోట (రాజమహేంద్రవరం రూరల్): ప్రజారోగ్య పరిరక్షణ సమష్టి బాధ్యత అని జిల్లా ఇన్‌చార్జి మంత్రి, రాష్ట్ర బీసీ సంక్షేమం, సమాచార పౌర సంబంధాలు, సినిమాటోగ్రఫీ శాఖల మంత్రి, వైఎస్సార్ సీపీ రూరల్ కో ఆర్డినేటర్ చెల్లుబోయిన వేణుగోపాలకృష్ణ అన్నారు. నగరాలను, గ్రామాలను కాలుష్య రహితంగా తీర్చిదిద్దేందుకు సీఎం జగన్ మోహన్ రెడ్డి నేతృత్వంలో రాష్ట్ర ప్రభుత్వం జగనన్న స్వచ్ఛ సంకల్ప కార్యక్రమాన్ని ప్రవేశ పెట్టిందన్నారు. ప్రతి ఒక్కరూ దీనిలో భాగస్వాములై తమ వంతు సహకారాన్ని అందించాలన్నారు. స్వచ్ఛత మనందరి బాధ్యత కార్యక్రమంలో భాగంగా ఆదివారం స్థానిక 16వ డివిజన్‌లోని శాంతిపురం, వీరభద్ర నగర్‌లో స్థానిక ప్రజలు, నాయకులు, అధికారులతో కలిసి ఆయన పర్యటించారు.

సమస్యల పరిష్కారం

మంత్రి వేణుగోపాలకృష్ణ ఇంటింటికీ వెళ్లి ప్రజా సమస్యలను తెలుసుకొని, వెంటనే పరిష్కరించేలా అధికారులకు ఆదేశాలు జారీ చేశారు. గ్రామాల్లోని వీధుల్లో చెత్త కుప్పలు తొలగించడం, ఇళ్ల మధ్య నీటి గుంతలు కనిపించకుండా పరిశుభ్రం చేయడం, రోడ్లపై చెత్త, మురుగు నీరు నిల్వ ఉండకుండా వీధులన్నీ పరిశుభ్రంగా ఉంచేలా సిబ్బంది, అధికారులు చర్యలు చేపట్టాలన్నారు. పారిశుధ్య నిర్వహణ పనులను పర్యవేక్షించారు. మెరుగైన శానిటేషన్‌పై అధికారులు దృష్టి సారించాలన్నారు. ప్రజలు ఎక్కడపడితే అక్కడ చెత్త వేయకూడదన్నారు. డ్రైనేజీ, మురుగునీటి పారుదల, పారిశుధ్య సమస్య పరిష్కారం దిశగా చేపట్టాల్సిన చర్యలపై అధికారులకు ఆదేశాలు జారీ చేశారు. స్వచ్ఛత మన బాధ్యత కార్యక్రమంలో అధికారులు, స్థానిక నాయకులు ఎంతో స్ఫూర్తిదాయకంగా పనిచేస్తున్నారని మంత్రి వేణు అన్నారు. జగనన్న సంకల్పానికి మేము సైతం అనే విధంగా రాష్ట్రానికి ఆదర్శంగా రూరల్ నియోజకవర్గాన్ని తీర్చిదిద్దడానికి కృషి చేస్తున్నామన్నారు. కార్యక్రమంలో శెట్టి బలిజ గౌడ ఈడిగ కార్పొరేషన్ మాజీ చైర్మన్ పాలిక శ్రీను, స్థానిక నాయకులు, అధికారులు పాల్గొన్నారు.

అభివృద్ధిని చూసి ఆశీర్వదించండి

- ఎంపీ, సిటీ కోఆర్డినేటర్ భరత్‌రామ్
- 21వ డివిజన్‌లో పర్యటన



క్షేత్రస్థాయిలో పర్యటిస్తున్న ఎంపీ భరత్ రామ్

రాజమహేంద్రవరం సిటీ: రాజమహేంద్రవరం నగరాన్ని ఎంతో అద్భుతంగా తీర్చిదిద్దానని, ఆ అభివృద్ధి నచ్చితే తనను సిటీ ఎమ్మెల్యేగా గెలిపించాలని ఎంపీ, వైఎస్సార్ సీపీ సిటీ కోఆర్డినేటర్ మార్గాని భరత్ రామ్ విజ్ఞప్తి చేశారు. నగరంలోని 21వ డివిజన్‌లో ఆదివారం ఆయన క్షేత్రస్థాయి పర్యటన చేశారు. పలు వీధులలో పార్టీ శ్రేణులతో కలిసి పర్యటించి, ప్రజల సమస్యలను అడిగి తెలుసుకున్నారు. సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని, ఎమ్మెల్యే కాగానే మీ ఇంటికి పెద్ద కొడుకును అవుతానని హామీ ఇచ్చారు. గోదావరి గట్టును హైదరాబాద్ ట్యాంక్ బండ్ కంటే అద్భుతంగా మారుస్తానన్నారు. గోదావరి ఘాట్లను ఏకం చేస్తానని చెప్పారు. కోటిలింగాల ఘాట్ నుంచి పుష్కరాల ఘాట్ వరకూ ఏకం చేసి, వాకర్స్‌కు చక్కటి సదుపాయాలు కల్పిస్తానని చెప్పారు. నగరంలో 24 గంటలూ మంచినీటి సరఫరా సదుపాయం కల్పిస్తానని ప్రకటించారు. ఎంపీగా ఈ ఐదేళ్లలో ఎలా అభివృద్ధి చేశానో, ఎమ్మెల్యే అయితే దానికి పదింతల అభివృద్ధి చేసి నగరాన్ని విశ్వ నగరంగా ప్రపంచ చిత్రపటంలో గుర్తింపు పొందేలా చేయడమే తన లక్ష్యమన్నారు. కార్యక్రమంలో అజ్జరపు వాసు, వార్డున ఇన్‌చార్జి, మాజీ కార్పొరేటర్ ఏపీ రమణ, కొల్లేపల్లి శేషయ్య పాల్గొన్నారు.

ఏప్రిల్ 16న ఏపీటీఎఫ్ 80 వసంతాల వేడుక

రాజమహేంద్రవరం సిటీ: ఆంధ్ర ప్రదేశ్ టీచర్స్ ఫెడరేషన్ (ఏపీటీఎఫ్) 80 వసంతాల వేడుకను ఏప్రిల్ 16న తాపేశ్వరంలో నిర్వహించనున్నట్టు జిల్లా అధ్యక్షుడు కేవీవీ సత్యనారాయణ తెలిపారు. ఈ మేరకు ఆదివారం నెహ్రూ నగర్ మున్సిపల్ హైస్కూల్లో సన్నాహక సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా రాష్ట్ర ప్రధాన కార్యదర్శి చిరంజీవి మాట్లాడుతూ ఉపాధ్యాయ ఉద్యమ మాతృసంస్థ ఏపీటీఎఫ్‌ను 1944 ఏప్రిల్ 16న స్థాపించారన్నారు. అప్పటి నుంచీ ఉపాధ్యాయుల సంక్షేమంతో పాటు సమాజ శ్రేయస్సు, విద్యపై అవగాహన కల్పిస్తోందన్నారు. సమావేశంలో జిల్లా గౌరవ అధ్యక్షుడు వరుణ అప్పయ్య శాస్త్రి, నగర్ శాఖ అధ్యక్షుడు డేవిడ్ లివింగ్‌స్టన్, జిల్లా అధ్యక్షులు పింగళి శ్రీనివాస్, రాష్ట్ర మాజీ కార్యదర్శి జి.చంద్రయ్య కోనసీమ జిల్లా అధ్యక్షులు వెంకటరాజు, ఎం.సత్యనారాయణ పాల్గొన్నారు.

నర్సరీల్లో మొక్కల అందాలు అద్భుతం



తెలంగాణ ఎమ్మెల్సీ కవితకు స్వాగతం పలుకుతున్న నర్సరీ రైతు పుల్లా ఆంజనేయులు తదితరులు



ఎస్పీ జగదీష్‌కు స్వాగతం పలుకుతున్న నర్సరీ రైతు వినయ్

కడియం: మండలంలోని పలు నర్సరీలను తెలంగాణ ఎమ్మెల్సీ, మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్ కుమార్తె కవిత ఆదివారం సందర్శించారు. ఈ సందర్భంగా ఆమెకు నర్సరీ రైతులు ఘన స్వాగతం పలికి, వివిధ రకాల మొక్కలను వివరించారు. ఆమె మాట్లాడుతూ నర్సరీల్లో మొక్కల అందాలు అద్భుతమన్నారు. తెలంగాణ హరిత హారం ద్వారా నర్సరీల అభివృద్ధికి కేసీఆర్ తోడ్పడ్డారన్నారు. కేసీఆర్ పుట్టిన రోజు సందర్భంగా రూపొందించిన మొక్కల కూర్పు ఫొటోను కవితకు పల్ల వెంకన్న నర్సరీ రైతులు అందజేశారు. కార్యక్రమంలో శ్రీ సత్యదేవ నర్సరీ రైతులు పుల్లా ఆంజనేయులు, పుల్లా పెద సత్యనారాయణ, పల్ల వెంకన్న, నర్సరీ రైతులు పల్ల సత్తిబాబు, సుబ్రహ్మణ్యం తదితరులు పాల్గొన్నారు.

నర్సరీని సందర్శించిన ఎస్పీ జగదీష్

జిల్లా ఎస్పీ పి.జగదీష్ ఆదివారం స్థానిక పల్ల వెంకన్న నర్సరీని సందర్శించారు. నర్సరీ రైతు పల్ల వినయ్ ఆయనకు వివిధ రకాల మొక్కల గురించి వివరించారు. కడియం ప్రాంత నర్సరీ రైతుల నైపుణ్యాన్ని ఎస్పీ అభినందించారు.

ఐక్యంగా ముందుకు సాగాలి

ప్రకాశం నగర్: ఉద్యోగులు ఐక్యంగా ముందుకు సాగాలని ఐసీడీఎస్ శాఖ రాష్ట్ర ఉద్యోగుల సంఘం రాష్ట్ర అధ్యక్షుడు శ్రీకాంత్ రాజు అన్నారు. స్థానిక చందా సత్రంలో ఆదివారం రాష్ట్ర మహిళాభివృద్ధి, శిశు సంక్షేమ శాఖకు చెందిన అధికారులు, ఉద్యోగులు, కాంట్రాక్ట్, అవుట్ సోర్సింగ్ ఉద్యోగుల సర్వసభ్య సమావేశం జరిగింది. ఈ సమావేశానికి ఐసీడీఎస్ సీడీపీవో వి. నరసమ్మ అధ్యక్షత వహించారు. శ్రీనివాసరాజు మాట్లాడుతూ త్వరలో ఉమ్మడిగా అన్ని తరగతుల ఉద్యోగులు, అధికారులతో 26 జిల్లాలో సమావేశాలు ఏర్పాటు చేస్తామని తెలిపారు.

కాపుల ఆత్మగౌరవాన్ని తాకట్టు పెట్టిన పవన్



ముద్దాల తిరుపతిరావు

రాజమహేంద్రవరం రూరల్: కాపుల ఆత్మగౌరవాన్ని చంద్రబాబు పాదాల వద్ద జనసేన అధినేత పవన్ కల్యాణ్ తాకట్టు పెట్టారని యువ కాపునాడు రాష్ట్ర అధ్యక్షుడు, రాష్ట్ర కాపు కార్పొరేషన్ డైరెక్టర్ ముద్దాల తిరుపతిరావు (అను) ఆగ్రహం వ్యక్తం చేశారు. ఈ మేరకు ఆదివారం బొమ్మూరులోని ఆయన కార్యాలయం నుంచి ప్రకటన విడుదల చేశారు. కాపుల ఆత్మ గౌరవాన్ని తాకట్టు పెట్టడానికే పవన్ కల్యాణ్ రాజకీయాల్లోకి వచ్చినట్టు ఉందన్నారు. గతంలో అన్నయ్య చిరంజీవి ప్రజారాజ్యం పార్టీతో కాపులను మోసం చేస్తే, కాపు ఉద్యమాన్ని అణచివేసిన చంద్రబాబుకు పవన్ మద్దతు ఇస్తున్నారన్నారు. చివరకు జనసేన కార్యకర్తలను కూడా అయోమయంలో పడవేశారన్నారు. చంద్రబాబు, పవన్‌ల మధ్య ఉమ్మడి కార్యాచరణ లేదని. ఇలాంటి నాయకుల్ని నమ్ముకుని కాపులు ముందుకు వెళ్లొద్దని హితవు పలికారు. కాపు ఉద్యమంలో కష్టకాలంలో మనకు తోడుగా నిలిచిన ఒకే ఒక్క వ్యక్తి సీఎం జగన్ మోహన్‌రెడ్డి అన్నారు.

వైభవంగా శిఖర ప్రతిష్ఠోత్సవం

రాజానగరం: స్థానిక శ్రీరాజలింగేశ్వరస్వామి, శ్రీరాజగోపాలస్వామి ఆలయ సముదాయంలో పునర్నిర్మించిన రాజరాజేశ్వరిదేవి ఆలయంపై శిఖర ప్రతిష్ఠోత్సవ కార్యక్రమాలు ఆదివారం వైభవంగా ప్రారంభమయ్యాయి. దాత కుందుల బలరామ కృష్ణ దంపతులచే శిఖర కలశానికి అభిషేకం చేసి, హోమం చేశారు. ఈ సందర్భంగా భక్తులతో లలిత సహస్రనామ పారాయణ జరిగింది. రెగడమిల్లి రాంబాబు బ్రహ్మత్వంలో శిఖర ప్రతిష్ఠోత్సవ కార్యక్రమాలు జరుగుతున్నాయి.

అభివృద్ధికి అరాచకానికీ మధ్య పోటీ



టీడీపీ నుంచి వైఎస్సార్ సీపీలో చేరిన యువకులు, మహిళలతో ఎంపీ భరత్‌రామ్

- ఎంపీ, సిటీ కోఆర్డినేటర్ భరత్‌రామ్
- వైఎస్సార్ సీపీలో 200 మందికి చేరిక

రాజమహేంద్రవరం సిటీ: రాష్ట్ర వ్యాప్తంగా పేదలకు, పెత్తందారులకు మధ్య పోటీ జరుగుతుంటే రాజమహేంద్రవరంలో మాత్రం అభివృద్ధికీ అరాచకానికీ మధ్య పోటీ నెలకొందని ఎంపీ, వైఎస్సార్ సీపీ సిటీ కో ఆర్డినేటర్ మార్గాని భరత్ రామ్ అన్నారు. స్థానిక 47వ డివిజన్ టీవీ రోడ్డులో వైఎస్సార్ సీపీ సిటీ యువజన విభాగం అధ్యక్షుడు పీతా రామకృష్ణ ఆధ్వర్యంలో సుమారు 200 మందికి పైగా టీడీపీకి చెందిన మహిళలు, యువకులు వైఎస్సార్ సీపీలో చేరారు. ఈ కార్యక్రమానికి ఎంపీ భరత్‌రామ్ ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఆయన మాట్లాడుతూ తాను ఎంపీగా ఎన్నికైన తరువాత 2019–2024 వరకూ చేసిన అభివృద్ధితో నగరం రూపు సమూలంగా మారిపోయిందన్నారు. కరోనా కాలంలో అభివృద్ధి కంటే ప్రజలను రక్షించుకోవడానికే ఎక్కువ తపన పడ్డానన్నారు. కరోనా బాధితులను అన్ని విధాలుగా ఆదుకున్నామన్నారు. మిగిలిన రెండున్నరేళ్లలో రూ.400 కోట్లతో రాష్ట్రంలో ఎక్కడా జరగనంత అభివృద్ధిని నగరంలో చేసి చూపించానన్నారు. టీడీపీ పాలనలో నగరాన్ని పెద్ద పల్లెటూరు మాదిరిగా వదిలేస్తే, తాను ఎంపీ అయిన తరువాత అభివృద్ధి చేశానన్నారు. రాజకీయ ముసుగులో సామాన్యులను వడ్డీ వ్యాపారం పేరుతో పీడించి, వారి ఆస్తులు కబ్జా చేయడం, ముక్కు పిండి చక్రవడ్డీలు వసూలు చేయడం నేరమన్నారు. అటువంటి వారిని రాజకీయాల్లోకి రానీయకూడదని, వచ్చినా ఎన్నుకోకూడదన్నారు. రాజమహేంద్రవరం రైల్వేస్టేషన్‌ను రూ.260 కోట్లతో అభివృద్ధి చేయనున్నామని, దీనికి సోమవారం ప్రధాని మోదీ వర్చువల్‌గా శంకుస్థాపన చేస్తామన్నారు. ఎయిర్ పోర్ట్‌లో రూ.350 కోట్లతో శరవేగంగా అభివృద్ధి జరుగుతోందన్నారు. మోరంపూడి ఫ్లై ఓవర్ నిర్మాణ పనులు పూర్తవుతున్నాయని, మార్చి నెలాఖరుకు ప్రారంభించి, జాతికి అంకితం చేస్తామన్నారు. కార్యక్రమంలో 47వ డివిజన్ వైఎస్సార్ సీపీ ఇన్‌చార్జి, మాజీ కార్పొరేటరు చోడిశెట్టి సత్యవేణి, తిరగాటి దుర్గ, గుడాల ఆదిలక్ష్మి, పాస్టర్ ప్రవీణ్ కుమార్, రేగుల్ల బాల శ్రీధర్, కస్సే రాజేష్ పాల్గొన్నారు.

ముగిసిన పంచాయతన పూర్వక సూర్యారాధన



పూర్ణాహుతి నిర్వహిస్తున్న కుమార్ శర్మ తదితరులు

సీటీఆర్ఐ: పేపర్ మిల్లు రోడ్డు సీతంపేటలో ఈ నెల 11 నుంచి శ్రీ పద్మాక్షీ సేవా సమితి పక్షాన వడలి కుమార్ శర్మ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న షోడశ దిన ప్రయుక్త పంచాయతన పూర్వక సూర్యారాధన ఆదివారం ఉదయం పూర్ణాహుతితో దిగ్విజయంగా పూర్తయింది. అనంతరం భారీ ఎత్తున అన్నదానం నిర్వహించారు. వేల మంది భక్తులు పాల్గొని అన్న ప్రసాదం స్వీకరించారు. ఈ సందర్భంగా కుమార శర్మ మాట్లాడుతూ గడచిన 15 రోజులుగా నిత్యం సూర్య భగవానుడికి విశేష పూజలు, అభిషేకాలు, సూర్యనమస్కారాలు, హోమాలు, శతచండీ పారాయణ, రుద్రాభిషేకం నిర్వహించామన్నారు. 16న రథ సప్తమి వేడుకలు, 17న రమా సమేత వీర వెంకట సత్యనారాయణస్వామి కల్యాణం, 19న శివ పార్వతుల కల్యాణం, 21న లక్ష్మీనారాయణ కల్యాణం, 23న పద్మినీ సౌంజ్ఞాచ్ఛాయ ఉషా సమేత సూర్య కల్యాణం భక్తి శ్రద్ధలతో జరిపామన్నారు. 24న శ్రీ మహాలక్ష్మీ ఆరాధనలు, ఎక్కడా జరగని విధంగా జ్యోతిర్లింగార్చన చేసినట్లు వివరించారు.

మార్చి మొదటి వారంలో ఆర్యవైశ్య వర్తకుల సభ



సమావేశంలో మాట్లాడుతున్న ఆర్య వైశ్య కార్పొరేషన్ చైర్మన్ కుప్పం ప్రసాద్

రాజమహేంద్రవరం సిటీ: ఆర్యవైశ్య వర్తకుల జిల్లా మహా సభ మార్చి మొదటి వారంలో జరుగుతుందని వైఎస్సార్ సీపీ వాణిజ్య విభాగం రాష్ట్ర అధ్యక్షుడు, ఆర్యవైశ్య కార్పొరేషన్ చైర్మన్ కుప్పం ప్రసాద్ తెలిపారు. ద్వారకా తిరుమల ట్రస్ట్ బోర్డు మెంబర్ నాళం సుజాత రోశయ్య ఆధ్వర్యంలో నగర ఆర్య వైశ్య సంఘం నాయకులతో కలిసి తాడితోటలోని సహిత డిగ్రీ కాలేజీలో ఆదివారం విలేకరుల సమావేశం నిర్వహించారు. ప్రసాద్ మాట్లాడుతూ ప్రతి జిల్లాలోనూ ఆర్య వైశ్యులు, వ్యాపారులతో సభలు నిర్వహిస్తున్నామన్నారు. సీఎం జగన్‌మోహన్‌రెడ్డి పాలనలోనే ఆర్యవైశ్యుల అభివృద్ధి సాధ్యమైందన్నారు. నవంబర్ ఒకటిన పొట్టి శ్రీరాములు జయంతి సందర్భంగా ఆంధ్రప్రదేశ్ అవతరణ దినోత్సవం ఏర్పాటు చేస్తూ జీవో తీసుకువచ్చారన్నారు. చింతామణి నాటకాన్ని ప్రదర్శించకుండా ఆపారన్నారు. ఆర్యవైశ్యుల సంక్షేమం కోసం ప్రత్యేక కార్పొరేషన్ ఏర్పాటు చేసి వైశ్యులకు విదేశీ విద్యను అందుబాటులోకి తీసుకువచ్చారన్నారు. అమ్మఒడి, రైతు భరోసా, వ్యాపారులకు చేయూత తదితర సంక్షేమ పథకాలలో వైశ్యులకు ప్రాధాన్యత కల్పించారన్నారు. కోవిడ్ సమయంలో అన్ని రాష్ట్రాలలో వైశ్యులు ఇబ్బందులు పడిన ప్పటికీ ఆంధ్రప్రదేశ్‌లో జగన్ పాలనలో వ్యాపారులు ఇబ్బందులు పడకుండా వ్యాపారాలు కొనసాగించారన్నారు. మాజీ ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడికి వైశ్యులపై ద్వేషం ఉండేదని, వారికి ఏ సంక్షేమ పథకం అమలు చేసిన దాఖలాలు లేవని ఆగ్రహం వ్యక్తం చేశారు. త్వరలో జరగబోయే ఆర్యవైశ్యుల మహాసభకు వ్యాపారులు వేలాదిగా తరలివచ్చి విజయవంతం చేయాలని కోరారు. సమావేశంలో వైశ్య సంఘాల నాయకులు కొల్లేపల్లి శేషయ్య, ఆర్యవైశ్య సంఘం జిల్లా అధ్యక్షులు ఎస్ఎస్ రెడ్డి, గ్రంధి నాన్నబాబులు, హితాకారిణి సమాజం ట్రస్ట్ బోర్డు డైరెక్టర్ మద్దు సతీష్ పాల్గొన్నారు.

శరవేగంగా కాతేరు – సీతానగరం రహదారి నిర్మాణం

సీతానగరం: కాతేరు – సీతానగరం నాలుగు లైన్ల రోడ్డు పనులు శరవేగంగా జరుగుతున్నాయి. రెండు నెలల క్రితం రఘుదేవపురం శివారు వరకూ వచ్చిన ఆగిన రోడ్డు పనులు పదిహేను రోజుల నుంచీ వేగవంతమయ్యాయి. ఎమ్మెల్యే జక్కంపూడి రాజా రఘుదేవపురం సెంటర్ వద్ద వ్యాపారస్తులతో మాట్లాడి, భవిష్యత్తు తరాల కోసం సహకరించాలని కోరారు. వారితో చర్చించిన అనంతరం వ్యాపారస్తులు రోడ్డు విస్తరణ పనులకు ఎటువంటి వ్యతిరేకం కాదని, రోడ్డు పనులు యథాతథంగా చేసుకోవచ్చని తెలిపారు. ఏమైనా అడ్డంకులు ఉంటే తొలగించడానికి అంగీకారం తెలిపారు. ఇప్పటికే దాదాపు తొంభై శాతం పనులు పూర్తయ్యాయి.

డాగ్ షో అదుర్స్..



జవహర్ లాల్ నెహ్రూ రోడ్డులోని దారా గ్రౌండ్స్‌లో ఆదివారం నిర్వహించిన బ్రీడ్స్ డాగ్ షో చాంపియన్ షిప్ పోటీ జంతు ప్రేమికులను విశేషంగా ఆకట్టుకుంది. రాష్ట్ర వ్యాప్తంగా తరలి వచ్చిన వివిధ రకాల జాతుల కుక్కలు ఆహూతులను అలరించాయి. బౌ అండ్ వవ్ కౌ సంస్థ నిర్వహించిన ఈ కార్యక్రమానికి తెలంగాణ, ఒడిశా రాష్ట్రాల నుంచే కాకుండా, భీమవరం, విజయవాడ, విశాఖపట్నం నుంచి కూడా జంతు ప్రేమికులు తమ కుక్కలతో తరలివచ్చారు. నిర్వాహకులు మాట్లాడుతూ రాజమహేంద్రవరంలో సుమారు 20 వేల వీధి కుక్కలు తిరుగుతున్నాయన్నారు. వీటిలో కొన్ని ప్రమాదాల బారినపడి కాళ్లు విరగ్గొట్టుకుంటున్నాయని, మరికొన్ని చర్మ వ్యాధులతో బాధపడుతున్నాయన్నారు. ఈ షో ద్వారా వచ్చే ఆదాయాన్ని వాటి చికిత్సకు ఖర్చుచేస్తామని తెలిపారు. పోటీల్లో న్యాయనిర్ణేతగా దినేష్ గౌడ్ వ్యవహరించారు. కార్యక్రమంలో ఈవెంట్ ఆర్గనైజర్ ఆర్‌జేవై గణేష్, ఆర్బీ స్టూడియో అధినేత చింతా రాజు, ఎస్ కాంటెడ్ కేఫ్ అధినేత దివ్య, శ్రీనివాస్, అవినాష్ పాల్గొన్నారు.



– రాజమహేంద్రవరం సిటీ









త్రిమూర్తులు స్వామివార్లకు ప్రత్యేక పూజలు



త్రిమూర్తులు స్వామివార్ల ఆలయంలో ఎమ్మెల్యే జక్కంపూడి రాజా

రాజానగరం: మండలంలోని నరేంద్రపురంలో పంట పొలాల మధ్య కొలువైన త్రిమూర్తులు స్వామివార్ల (బ్రహ్మ, విష్ణు, మహేశ్వరులు)ను ఆదివారం స్థానిక ఎమ్మెల్యే, వైఎస్సార్ సీపీ జిల్లా అధ్యక్షుడు జక్కంపూడి రాజా దర్శించుకున్నారు. ఉత్సవాల నిర్వాహకులు ఆయనకు ఘనంగా స్వాగతం పలికారు. అనంతరం ప్రాంగణంలో నిర్వహించిన అన్న ప్రసాద వితరణ కార్యక్రమంలో ఎమ్మెల్యే పాల్గొన్నారు. ఈ సందర్భంగా రాజా మాట్లాడుతూ త్రిమూర్తులు ఆలయాలు దేశంలో చాలా అరుదుగా ఉంటాయని, ఈ ఆలయం రాజానగరం నియోజకవర్గంలోని నరేంద్రపురంలో ఉండటం ఈ ప్రాంత వాసుల అదృష్టమన్నారు. ఉత్సవాలకు ఘనంగా ఏర్పాట్లు చేసిన ఆలయ కమిటీ సభ్యులను అభినందించారు. త్రిమూర్తులు స్వామివార్ల 77వ తీర్థ మహోత్సవాలు శనివారం ప్రారంభమైన విషయం తెలిసిందే. ఐదు రోజుల పాటు ఈ ఉత్సవాలు జరగనున్నాయి. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ స్థానిక నాయకులు పంపన శ్రీను, ప్రగడ రామచంద్రరావు పాల్గొన్నారు.